క్లుప్తంగా

సాక్షి గణపతికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షి గణపతికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేష పుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే జ్వాలా వీరభద్రస్వామికి అభిషేకం, విశేష పుష్పార్చన జరిపించారు.

ఎల్‌పీఎం సమస్యలకు 15 రోజుల్లో పరిష్కారం



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసగౌడు

వెలుగోడు: సమగ్ర భూముల రీసర్వేతో ఏర్పడిన ల్యాండ్ పార్సిల్ మ్యాప్(ఎల్‌పీఎం) సమస్యలను 15 రోజుల్లో పరిష్కరిస్తామని తహసీల్దార్ శ్రీనివాసగౌడు తెలిపారు. బుధవారం రేగడగూడూరు గ్రామంలో ఎల్‌పీఎం సమస్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఐదారుగురు రైతులకు కలిపి ఒకే ఎల్‌పీఎం నంబరు కేటాయించారన్నారు. జాయింట్ ఎల్‌పీఎంలకు సంబంధించి విభజనకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కౌలు రైతులు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్‌ఐ వెంకట్రామిరెడ్డి, వీఆర్‌వోలు వేణుగోపాల్, వెంకటశివుడు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులతో కలిసి డయేరియా పోస్టర్లను ప్రదర్శిస్తున్న అధికారులు

పాములపాడు: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. బుధవారం మండలంలోని మిట్టకందాల గ్రామంలో స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. వీధుల్లో పర్యటించి అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను శుభ్రం చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు చేతులు శుభ్రంగా కడుక్కోవడం, వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. జలుబు, జ్వరం, దగ్గు, వాంతులు, విరేచనాలు తదితర లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. సర్పంచు చింతల నారాయణ, డిప్యూటీ ఎంపీడీఓ సులోచన పాల్గొన్నారు.

సన్మానం



ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను సత్కరించిన ఉపాధ్యాయులు, దాతలు

పాములపాడు: మండల పరిధిలోని వేంపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైన లావణ్య, రేణుక, రాణి, కేశవర్ధన్‌నాయక్‌ను, పాఠశాల నుంచి బదిలీ అయిన హెచ్‌ఎం కృష్ణమూర్తిని బుధవారం గ్రామస్తులు, ఉపాధ్యాయులు, దాతలు సన్మానించారు. 10వ తరగతిలో అధిక మార్కులు సాధించిన లావణ్య(584), రేణుక(578)లకు దాతలు సత్యచంద్రప్రసాద్, మూల నాగేంద్రుడు రూ.10వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నూతన హెచ్‌ఎం రఫి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా వై.రామకృష్ణవేణి

బండి ఆత్మకూరు: ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా వై.రామకృష్ణవేణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులను సమన్వయం చేసుకుని మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె తెలిపారు.

జగనన్న కాలనీలో సీసీ రోడ్లు వేయాలి

నందికొట్కూరు: జగనన్న కాలనీలో సీసీ రోడ్లు వేయాలని సీపీఐ (ఎంఎల్) జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణ సమీపంలో జగనన్న కాలనీలో నెలకొన్న సమస్యలను కాలనీ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికే ప్రజలు నడవడానికి వీలులేకుండా వర్షం నీరు రోడ్లపైనే నిలిచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పార్టీ నాయకులు సుధాకర్, షేక్షావలి, స్వాములు, హుసేన్, చంద్ర, మధు, మహమ్మద్, సయ్యద్‌బాషా, రఫి, జనార్దన్, వెంకటశివుడు పాల్గొన్నారు.

ప్రతిపాదనలు ప్రభుత్వానికి పట్టేనా?

- మల్యాల–1, 2 ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ..నిలిచిన నీటి పంపింగ్
- పనిచేయని జూపాడుబంగ్లా, సంగమేశ్వరం ఎత్తిపోతల మోటార్లు
- పంపులు, ఎలక్ట్రికల్, మెకానిక్ సర్వీసుకు రూ.35.61 కోట్లతో ప్రతిపాదనలు
- స్పందించని ప్రభుత్వం

ఎత్తిపోతల పథకాల నిర్వహణను ప్రభుత్వం గాలికొదిలేసింది. చిన్నచిన్న మరమ్మతులకు గురైనా పట్టించుకునేవారే లేరు. ఫలితంగా నీరు అందక.. పంటలు పండక అన్నదాతలు అప్పులపాలవుతున్నారు. నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా, మల్యాల, కొత్తపల్లి ఎత్తిపోతల పథకాలున్నాయి. వీటి కింద వేల ఎకరాల ఆయకట్టు కుంది. చిన్నచిన్న సమస్యల వల్ల ఎత్తిపోతల పథకాల నుంచి సాగు నీరు సక్రమంగా అందడం లేదు. మరమ్మతుల కోసం అధికారులు రూ.35.61 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరు చేసి ఎత్తిపోతల పథకాలను బాగు చేయించి రైతన్నలను ఈ కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందా వ్యవసాయం దండగా అంటూ గాలికొదిలేస్తుందా వేచి చూడాలి. – జూపాడుబంగ్లా



జూపాడుబంగ్లా ఎత్తిపోతల పథకం ముఖచిత్రం



మరమ్మతులకు నోచుకోని రెండు మోటార్లు

- జూపాడుబంగ్లా–1, 2 ఎత్తిపోతల పథకాలకు ఐదు మోటార్లు ఉండగా 9,289 ఎకరాల ఆయకట్టు ఉంది. పథకంలోని ఐదు మోటార్లలో రెండు మోటార్లు మరమ్మతులకు గురికావటంతో ప్రస్తుతం మూడు మోటార్లు మాత్రమే పనిచేస్తుండగా పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గతేడాది మూడు మోటార్లు పనిచేయకపోవటంతో పొలాలకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మోటార్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని రైతులు ప్రభుత్వానికి విన్నవించుకున్నా ప్రయోజనం లేకపోవటంతో సొంతంగా డబ్బు వెచ్చించి ఓ మోటారును మరమ్మతు చేయించుకుని కొంత ఆయకట్టుకు సాగునీటిని పారించుకుంటున్నారు. మిగిలిన రెండు మోటార్ల మరమ్మతులకు రూ.2.06 కోట్ల నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి అధికారులు ప్రదిపాదనలు పంపారు.
- మల్యాల–1, 2 ఎత్తిపోతల పథకానికి నాలుగు మోటార్లు ఉండగా 9,800 ఎకరాల ఆయకట్టు ఉంది. మోటార్లకు విద్యుత్ సరఫరా చేసే రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఈ ఏడాది ఫిబ్రవరి మాసంలో దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో గత నాలుగు మాసాలుగా మల్యాల ఎత్తిపోతల పథకానికి విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్లు లేక నిరుపయోగంగా మారింది. సత్వరమే నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయకపోతే మల్యాల–1, 2 ఎత్తిపోతల పథకాల నుంచి సాగునీటిని సరఫరా చేసుకునే అవకాశం ఉండకపోవటంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు పంపులు, ఎలక్ట్రికల్, మెకానికల్ సర్వీసుల నిమిత్తం రూ.22.35 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు.
- కొత్తపల్లి మండలంలో ఉన్న సంగమేశ్వరం ఎత్తిపోతల పథకానికి ఐదు మోటార్లు ఉండగా ఐదువేల ఎకరాల ఆయకట్టు ఉంది. గతేడాది నుంచి రెండు మోటార్లు మరమ్మత్తులకు గురవ్వటంతో ప్రస్తుతం మూడు మోటార్లు మాత్రమే పనిచేస్తుండటంతో పూర్తి స్థాయి ఆయకట్టుకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవటంతో పాటు వర్షాధారంపై ఆధారపడి పంటలు సాగుచేసుకోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకం రెండు మోటార్ల మరమ్మతులతో పాటు లింక్ చానల్‌లో పేరుకుపోయిన పూడికతీత, పంపులు, ఎలక్ట్రికల్, మెకానికల్ సర్వీసుల నిమిత్తం రూ.6.20 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. శ్రీశైలం జలాశయంలో గణనీయంగా నీటిమట్టం పెరిగినందున ఎత్తిపోతల పథకాల నుంచి సత్వరమే సాగునీటిని విడుదల చేసుకొని పంటలు సాగుచేసుకొనేందుకు వీలుగా మోటార్ల మరమ్మతులు, నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, అప్రోచ్ కాల్వల్లో పూడికతీత, పంపులు, ఎలక్ట్రికల్, మెకానికల్ సర్వీసుల నిమిత్తం కూటమి ప్రభుత్వం సత్వరమే స్పందించి నిధులు మంజూరు చేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.
- కొత్తపల్లి మండలంలో ఉన్న శివపురం ఎత్తిపోతల పథకానికి మూడు మోటార్లు ఉండగా 3,500 ఎకరాల ఆయకట్టు ఉంది. పంపులు సర్వీసుకు నోచుకోకపోవటంతో సక్రమంగా సాగు నీరు సరఫరా కావడం లేదని ఆయకట్టు రైతులు పేర్కొంటున్నారు. దీంతో పంపులు, ఎలక్ట్రికల్, మెకానికల్ సర్వీసుల నిమిత్తం రూ.5 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు.

అదనపు భూ సేకరణకు క్లెయిమ్స్ స్వీకరణ



రైతుల నుంచి స్వీకరించిన క్లెయిమ్స్ పరిశీలిస్తున్న ఆర్డీఓ నాగజ్యోతి

పాములపాడు: నేషనల్ హైవే 340సీ నిర్మాణ పనులకు సంబంధించి అదనపు భూ సేకరణ నిమిత్తం రైతుల నుంచి క్లెయిమ్స్‌ను ఆర్డీఓ నాగజ్యోతి స్వీకరించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ మాట్లాడుతూ జూటూరు గ్రామం వద్ద జరుగున్న హైవే పనులకు 3.805 ఎకరాలు అవసరముందన్నారు. భూమి యజమానులు 38 మందికి అవార్డు కాపీలను అందించామన్నారు. వీరంతా భూముల ధ్రువ పత్రాలు, ఆధార్ కార్డు, పొలం పాసుబుక్కులతోపాటు 11 రకాల పత్రాలను అందించాలన్నారు. రైతుల నుంచి క్లెయిమ్స్ పత్రాలు స్వీకరించినట్లు వివరించారు. అలాగే జూపాడుబంగ్లా మండలంలో 1.07 ఎకరాల భూమి సేకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుభద్రమ్మ, ఆర్‌ఐ ఖాజాబీ, మండల సర్వేయర్ భాస్కర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

పంటలకు బీమా చేయించుకోండి



మాట్లాడుతున్న డీఆర్‌సీ ఏడీఏ చెన్నయ్య

బండిఆత్మకూరు: సాగు చేసిన ప్రతి పంటను బీమా చేయించుకోవాలని డీఆర్‌సీ ఏడీఏ చెన్నయ్య రైతులకు సూచించారు. మండలంలోని సంత జూటూరు, నారాయణపురం గ్రామాల్లో బుధవారం మండల వ్యవసాయ అధికారి ఆర్.పవన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏడీఏ చెన్నయ్య పాల్గొని మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాలు, తెగులు, వ్యాధుల కారణంగా పంటలకు నష్టం జరిగినప్పుడు బీమా సొమ్ము అందుతుందన్నారు.

- వెలుగోడు: మండలంలోని రేగడగూడూరు, వేల్పనూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ స్వాతి వరి పొలాలను పరిశీలించి సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ జయపాల్

వెలుగోడు: మేజర్ పంచాయతీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సర్పంచ్ వేల్పుల జయపాల్ కోరారు. బుధవారం సచివాలయం–2 పరిధిలో గ్రామ కార్యదర్శి నాగేంద్రగౌడు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని 5 సచివాలయాల పరిధిలో రూ.49 లక్షలతో చేపట్టిన వివిధ అభివద్ధి కార్యక్రమాలు, సీసీ రోడ్లు, భవనాల నిర్మాణాలపై ప్రగతి నివేదికలు చదివి గ్రామస్తులకు వివరించారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. పంచాయతీ ఆదాయం పెంచేందుకు పాతబస్టాండ్‌లో వాణిజ్య కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. సభలో వైస్ ఎంపీపీ శంకర్‌నాయక్, ఎంపీటీసీలు, వార్డుమెంబర్లు పాల్గొన్నారు.

రేపు ‘చలో పోతిరెడ్డిపాడు’

ఆత్మకూరు: సాగునీరు విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ ఈనెల 4న చలో పోతిరెడ్డిపాడు కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుతోట రాజశేఖర్ తెలిపారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాలులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కురిసిన వర్షాలకు శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరదనీరు వచ్చి చేరిందన్నారు. ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టులో 875 అడుగుల నీరు చేరిందని, ఇంత నీరు చేరినప్పటికీ రాయలసీమ ప్రాంత రైతులకు సాగునీరు విడుదల చేయకపోవడం తగదన్నారు. గతంలో 850 అడుగుల నీటి మట్టం ఉన్నప్పుడు కూడా సాగునీటిని విడుదల చేసిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఇప్పటికే కర్నూలు, కడప జిల్లాల్లో కరువు పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. ముందస్తు వర్షాలకు ఆత్మకూరు డివిజన్‌లోని కొత్తపాడు, ఆత్మకూరు, వెలుగోడుతో పాటు బండిఆత్మకూరు, మహానంది మండలాల్లో వేలాది ఎకరాల్లో సాగు చేసుకున్న మొక్కజొన్న, పత్తి, కంది పైర్లు వాడిపోతున్నాయన్నారు. తెలుగుగంగ, తుంగభద్ర ప్రాజెక్టులతోపాటు పోతిరెడ్డిపాడు నుంచి నీటిని విడుదల చేసి రైతులకు సాగునీరు అందించాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు మాబాషా, వీరన్న, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ స్థలంలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

నందికొట్కూరు: పట్టణంలోని గ్రంథాలయ ఖాళీ స్థలంలో అక్రమ నిర్మాణం చేపట్టిన వారిపై అధికారి ఎం.మురళీధర్ బుధవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీఎల్ఎస్ గాంధీ, రాజగోపాల ఆచారి, మూలింటి వీరయ్య, పురుషోత్తమయ్య 392బి సర్వే నంబరులోని 45 సెంట్ల స్థలాన్ని దానమిచ్చారు. అయితే పి.మద్దిలేటి వారసులు స్థలం తమదేనంటూ కోర్టుకు వెళ్లారు. కోర్టు 2022 అక్టోబర్ 12న గ్రంథాలయానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అయినా మద్దిలేటి వారసులు దౌర్జన్యంగా ఇంటి నిర్మాణం చేపట్టడంతో పోలీసులను ఆశ్రయించగా వారు ఘటనా స్థలానికి చేరుకుని నిర్మాణాన్ని ఆపేశారని గ్రంథాలయాధికారి తెలిపారు. దాతలు ఇచ్చిన స్థలాన్ని కాపాడుకునేందుకు ప్రజలు కూడా ముందుకు రావాలని ఆయన కోరారు.

స్వయం ఉపాధిని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఆర్.సునీత

నందికొట్కూరు: యువత స్వయం ఉపాధిని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.సునీత సూచించారు. బుధవారం కళాశాలలో యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన అవకాశాలను ఉపయోగించుకోవాలన్నారు. స్వతంత్రంగా వివిధ రకాల పరిశ్రమలు నెలకొల్పి నలుగురికి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ఎదగాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు తలత్ ఫర్వీన్, హుసేన్, పరిమళాదేవి, ఝాన్సీరాణి, అమర్నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ భూములకు నేడు బహిరంగ కౌలు వేలం

బండిఆత్మకూరు: మండలంలోని సంతజూటూరు గ్రామంలోని పలు ఆలయ భూములకు బహిరంగ కౌలు వేలం నిర్వహించనున్నట్లు గ్రూపు ఆలయాల కార్యనిర్వహణ అధికారి ఈ నాగ ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని చెన్నకేశవ స్వామి ఆలయానికి చెందిన 43 ఎకరాలకు, ఆంజనేయస్వామి ఆలయానికి చెందిన 4 ఎకరాలకు బహిరంగ వేలం నిర్వహించనున్నామని, వేలంపాటలో పాల్గొనే వారు రూ.1000 చెల్లించాలన్నారు.

కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం

ఆత్మకూరు: మున్సిపల్ కార్మికుల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం విస్మరించిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం అన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు ఆయన బుధవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా యేసురత్నం మాట్లాడుతూ జీఓ ఎంఎస్ నం.36 ప్రకారం కార్మికులకు వేతనాలు పెంచాలన్నారు. పారిశుద్ధ్య పనులు, తాగునీటి సరఫరా తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ వారి సమస్యలు పరిష్కరించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలని, టీఏ, డీఏ అలవెన్సులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సంఘం నాయకులు తిమ్మయ్య, చిన్ననాగరాజు, అశోక్, ఖాదర్, జయన్న, గొడుగు రాజు, సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, నాగన్న, పెద్ద నాగరాజు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ ఆఫ్ కో ఆపరేటివ్ ప్రొడక్ట్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నందికొట్కూరు: ఎగ్జిబిషన్ ఆఫ్ కో ఆపరేటివ్ ప్రొడక్ట్స్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నందికొట్కూరు, పగిడ్యాల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల సీఈఓలు రబ్బాని, ఖాజామొహిద్దీన్ సూచించారు. బుధవారం పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయంలో అంతర్జాతీయ పరపతి సంఘం వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. 103వ ఇంటర్నేషనల్ కో ఆపరేటివ్ డే సందర్భంగా వ్యవసాయ పరపతి సంఘం రైతులకు అందిస్తున్న సేవలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతులకు రుణాలు, సబ్సిడీలను ఫర్టిలైజర్స్ అందజేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే రైతులకు అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహిస్తామన్నారు.

రేపు వికలాంగులకు పరికరాల పంపిణీ

వెలుగోడు: ఈనెల 4న వికలాంగులు, వృద్ధులకు అవసరమైన పరికరాలను ఆత్మకూరులో పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన గ్రామ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వృద్ధులు, వికలాంగులకు పరికరాలు అందిస్తారనే విషయాన్ని గ్రామాల్లో డండోరా వేయించాలని గ్రామ కార్యదర్శులకు సూచించారు.

చెక్కుల పంపిణీ

వెలుగోడు: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా భరోసా కల్పిస్తుందని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ. 34 లక్షల చెక్కులను నియోజకవర్గానికి చెందిన 32 మంది లబ్ధిదారులకు బుధవారం వేల్పనూరులో ఎమ్మెల్యే అందజేశారు. ప్రాణాపాయ స్థితిలో, అనారోగ్యం బారిన పడిన నిరుపేదలకు సీఎం సహాయ నిధి వరంలాంటిదన్నారు.



పత్తి పైరులో తాండవిస్తున్న వర్షపు నీరు

పగిడ్యాల మండలంలో జోరువాన

పగిడ్యాల: మండలంలో బుధవారం జోరుగా వర్షం కురిసింది. 56.4 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ శివరాముడు తెలిపారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో ముందస్తుగా నాటిన మొక్కజొన్న, పత్తి పైర్లకు ఎంతో మేలు అని రైతులు పేర్కొంటున్నారు. మరోవైపు ముచ్చుమర్రి, నెహ్రూనగర్, పగిడ్యాల, ప్రాతకోట, లక్ష్మాపురం తదితర గ్రామాల రైతులు మొక్కజొన్న, సోయాబీన్స్, పత్తి, కంది, తదితర విత్తనాల సాగుకు ఉపక్రమించారు.

- కొత్తపల్లి: మండలంలో మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం సాయంత్రం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. 8.4 మి.మీల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. పొలాల్లో వర్షపు నీరు చేరడంతో ఇటీవల వేసిన విత్తనాలు మొలకెత్తుతాయో లేదోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.
- మహానంది: మండలంలో రెండో రోజు బుధవారం సాయంత్రం నుంచి వర్షం కురిసింది. 30 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. జూన్ నెలలో ఆశించిన మేరకు వర్షపాతం నమోదు కాలేదు. జూన్ నెలలో 66 మి.మీ వర్షపాతం నమోదుకావ్వాల్సి ఉండగా కేవలం 50 మి.మీ మాత్రమే కురిసిందని వ్యవసాయ అధికారి నాగేశ్వరరెడ్డి తెలిపారు.

శ్మశాన వాటిక క్రయ విక్రయదారులపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దళితులు

పాములపాడు: మండలంలోని యర్రగూడూరు గ్రామంలో దళితుల శ్మశాన వాటిక క్రయ విక్రయాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు లింగాల నాగరాజు బుధవారం గ్రామ దళితులతో కలిసి తహసీల్దార్ సుభద్రమ్మకు వినతి పత్రం అందజేశారు. గ్రామానికి చెందిన షేక్ చాంద్‌బాషా, దేవరశెట్టి వెంకటేశ్వర్లు, మంజుల చిన్న నాగేష్, మంజుల రమణమ్మ, కటారి భాగ్యమ్మ, కటారి శ్రీనివాసులు, మంజుల సాలమ్మలతో పాటు మరికొందరు శ్మశాన వాటికలో ఇంటి నిర్మాణాలు చేపట్టారన్నారు. రాజకీయ పార్టీల నాయకుల అండదండలతో ప్లాట్లు వేసి అమ్మకాలు చేపడుతున్నారని, తక్షణమే విచారించి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు



సమస్యను సభ దృష్టికి తెస్తున్న ఎంపీటీసీ మల్లికార్జునరెడ్డి

మహానంది: ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహించొద్దని ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని అధికారులకు సూచించారు. తిమ్మాపురం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తమ్మడపల్లె గ్రామ పరిధిలో వరి పంటలు ఎక్కువగా సాగవుతాయని వ్యవసాయ విస్తరణాధికారిని నియమించాలని జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, ప్రభుత్వ బోరు ఆక్రమణకు గురైందని ఇదే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని మసీదుపురం ఎంపీటీసీ మునగాల నాగమల్లికార్జునరెడ్డి, మహానందిలోని ఈశ్వర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రానికి తలుపులు, కిటికీలు శిథిలావస్థలకు చేరాయని అంగన్‌వాడీ కార్యకర్త ఫాతిమా మేరీరాణి సభ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సభ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి వెంటనే కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఈఓఆర్డీ నాగేంద్రుడు, ఏఓ నాగేశ్వరరెడ్డి, ఏఈ ప్రభాకర్‌రెడ్డి, ఏపీఎం తిరుపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కుంచపు లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సమీక్ష సమావేశం

బండిఆత్మకూరు: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా స్థానిక రాఘవేంద్ర విద్యా మందిరంలో బుధవారం నియోజకవర్గ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూల వెంకట సుబ్బన్న మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఇన్‌చార్జి అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న హరికథ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై ప్రొద్దుటూరుకు చెందిన వై.రమణయ్య హరికథా భాగవతార్, బృందం వారి శివపార్వతుల కల్యాణంపై నిర్వహించిన హరికథ కార్యక్రమం ఆకట్టుకుంది.

కొనసాగిన యోగా శిక్షణ



శ్రీశైలంటెంపుల్: చంద్రవతి కల్యాణ మండపంలో రెండో రోజు బుధవారం ఉచిత యోగా శిక్షణ కొనసాగింది. దేవస్థానం సిబ్బంది, స్థానికులు, భక్తులతో యోగా గురువు గంధవళ్ళ బాలసుబ్రహ్మణ్యం యోగాసనాలు వేయించారు.